**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

అడవికేగినట్టి యావును వ్యాఘ్రమ్ము
తిష్టవేసి పలికె తినెదననుచు
బ్రతిమిలాడి వెళ్ళి పట్టికి పాలిచ్చి
తిరిగిరాగ పులియు తినక వదిలె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 20 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 28-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# సర్ సక్రమమే!

## ఈసీ ప్రక్రియను అడ్డుకోలేం

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు
- ఓటరు జాబితా సవరణలకు ఈసీకి అధికారాలున్నాయి
- నిలిపివేయాలన్న విపక్షాల పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల కమిషన్ నిర్ణయానికి ఆమోదముద్ర


**న్యూఢిల్లీ**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

-మిగతా 2 లో

# అకాల వర్షాలు.. హై అలర్ట్!

## అధికారులను హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి




- తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- మక్కలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి
- కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు

**హైదరాబాద్,**

వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీవర్షాలు, ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని బుధవారం జరిగిన అధికారుల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో

-మిగతా 2 లో




## చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

- చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు

2



## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ వ్యవస్థలు మరిన్ని కావాలి..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్
- అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

2



## ఆకునూరి మురళి రాజీనామా వెనుక అసలు కారణాలేమిటి..?

**- విద్యా కమిషన్‌లో అవినీతి ఆరోపణలు, పైరవీల వ్యవహారాలపై తీవ్ర అసంతృప్తే కారణమా..?**

**హైదరాబాద్, మే 27(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడిగా కొనసాగుతున్న ఆకునూరి మురళి రాజీనామా రాష్ట్ర విద్యా, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అధికారికంగా వ్యక్తిగత కారణాలను ప్రస్తావించినప్పటికీ, కమిషన్‌లో కొనసాగుతున్న అంతర్గత పరిణామాలు, సభ్యులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆయన నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలకు కట్టుబడి ఉన్న వ్యక్తిగా పేరున్న ఆకునూరి మురళి, కమిషన్ పనితీరుపై గత కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా కొందరు సభ్యులపై పైరవీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడం, కమిషన్ ప్రతిష్టను దెబ్బతీస్తోందనే భావన ఆయనలో పెరిగినట్లు విద్యా వర్గాలు

-మిగతా 2 లో

# తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ




- రాష్ట్రవ్యాప్తంగా 12 మంది తహసీల్దార్ల బదిలీ
- డీఆర్ఓ, ఎస్‌డీసీ పోస్టుల్లో కొత్త నియామకాలు
- పరిపాలనా అవసరాలతో ప్రభుత్వం కీలక నిర్ణయం
- వెంటనే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు

**తెలంగాణ బ్యూరోప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది

-మిగతా 2 లో

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు



- వాతావరణ శాఖ హెచ్చరికలు
- ఉరుములు మెరుపులు ఈదురుగాలులకు అవకాశం
- పలు జిల్లాలలో ఆరెంజ్ హెచ్చరికలను జారీ
- ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని స్పష్టీకరణ

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

-మిగతా 2 లో

## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

- పార్టీ జెండా ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి
- హాజరైన పార్టీ ప్రముఖులు, పోలిట్ బ్యూరో సభ్యులు




**అమరావతి**

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో

-మిగతా 2 లో

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

## వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి



- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,**

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని

-మిగతా 2 లో



## 30న కర్ణాటకకు కొత్త సీఎం..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

**బెంగళూరు**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం(మే 28) సాయంత్రం 3 గంటలకు తన పదవికి రాజీనామా చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తన రాజీనామా సమర్పించడానికి గురువారం సాయంత్రం 3 గంటలకు ఆయన రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ కోరినట్లు వర్గాలు తెలిపాయి. న్యూఢిల్లీలో మంగళవారం కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంతో జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఊహించిన ఈ చర్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి మార్గం సుగమం చేయనున్నది. కాగా, ముఖ్యమంత్రి

-మిగతా 2 లో

# సర్ సక్రమమే!

మొదటి తరువాయి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత, చివరి దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# అకాల వర్షాలు.. హై అలర్ట్!


మొదటి తరువాయి

ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

---

# చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు




న్యూఢిల్లీ:
ఇస్రో మరో మైలురాయిని అందుకుంది. చంద్రుడిపై నీళ్లు ఉన్నాయని తెలిపే కచ్చితమైన ఆధారాలను గుర్తించింది. చంద్రయాన్-2 డాటా సాయంతో అత్యంత శీతలమైన, రహస్యమైన చంద్రుడి దక్షిణ ధృవం వద్ద మంచు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించినట్టు ఇస్రో తెలిపింది.చంద్రయాన్ 2 ఆర్బిటార్‌లోని డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్ (డీఎఫ్ఎస్ఏఆర్) సాయంతో మంచును గుర్తించారు. దక్షిణ ధృవంలోని బిలాల అడుగున ఈ మంచు ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇక్కడ 25 కెల్విన్ లేదా మైనస్ 248 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉంటాయి. బిలియన్ల ఏండ్ల కిందినుంచే ఇక్కడ మంచు ఏర్పడ్డట్టు సైంటిస్టులు చెబుతున్నారు. చంద్రుడి ధ్రువప్రాంతాల్లో మంచు, నీరు ఉన్నాయనేందుకు తాజా ఆవిష్కరణ మరో బలమైన ఆధారంగా నిలువనున్నది.

# తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ

మొదటి తరువాయి

తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు (డీఆర్ఓ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నూతన ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహసీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహసీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్‌డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్‌డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్‌డీసీగా, ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్‌డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## 30న కర్ణాటకకు
# కొత్త సీఎం..

మొదటి తరువాయి



పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య తనకు చెప్పారని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే కూడా బుధవారం ధృవీకరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అధికార పోరు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ మార్పు జరగనున్నది.

## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ
# వ్యవస్థలు మరిన్ని కావాలి..

**రష్యాను కోరిన భారత్.. కొనసాగుతున్న చర్చలు**



ఇండియా-- రష్యా మధ్య ఉన్న మైత్రి గురించి తెలిసిందే. రక్షణ, సాంకేతికత, చమురు, వ్యాపారం, వాణిజ్యం సహా అనేక అంశాల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత రక్షణ వ్యవస్థకు రష్యా తోడ్పాటునందిస్తూ వస్తోంది. ఇండియాకు అవసరమైన కొన్ని యుద్ధ విమానాలు, మిస్సైల్స్ వంటివి రష్యా సరఫరా చేస్తోంది. ఇండియాకు రష్యా అందిస్తున్న వాటిలో ఎస్--400 లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ కీలకమైనవి.వీటిని అందించే విషయంలో 2018లో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. 5.4 బిలియన్ డాలర్ల ఒప్పందం మేరకు ఐదు ఎస్--400 క్షిపణి రక్షణ వ్యవస్థల్ని ఇండియాకు రష్యా అందించాలి. 2023 వరకు మూడు రక్షణ క్షిపణి వ్యవస్థల్ని అందించింది. ఇంకో రెండు ఎస్--400 మిస్సైల్స్ సిస్టమ్స్ ఈ పాటికే రావాలి. కానీ, రష్యాకు, ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా వీటిని సమయానికి అందించలేకపోయింది. దీంతో ఈ వ్యవస్థల్ని త్వరగా అందించాలని రష్యాను ఇండియా కోరింది. అంతేకాదు.. మరిన్ని ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్ కొనుగోలు చేసేందుకు కూడా ఇండియా మొగ్గు చూపుతోంది. ఈ అంశంపై రష్యాకు చెందిన ఎఫ్ఎస్‌వీటీఎస్ (ఫెడరల్ సర్వీసెస్ ఫర్ మిలిటరీ-- టెక్నికల్ కోపరేషన్) సంస్థతో ఇండియా చర్చలు జరుపుతోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ కూడా వెల్లడించింది. రష్యా నుంచి ఇలాంటి మరింత అదనపు వ్యవస్థల్ని కొనుగోలు చేయాలని ఇండియా భావిస్తోంది. ఇక మిగిలిన ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను త్వరలోనే అందిస్తామని ఎఫ్ఎస్‌వీటీఎస్ చీఫ్ దిమిత్రీ షుగయేవ్ ఇటీవల తెలిపారు. నిజానికి ఇవి ఈ నెలలోనే రావాలి. కానీ, వచ్చే నవంబర్ నాటికి అందజేస్తామని తాజాగా రష్యా వెల్లడించింది. అలాగే, ఇండియా కోరినట్లు అదనపు మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని దిమిత్రీ తెలిపారు. ఈ మిస్సైల్స్ సిస్టమ్స్.. రష్యా తయారు చేసిన అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ. అంటే శత్రువులు ప్రయోగించి క్షిపణుల్ని గుర్తించి, గాలిలోనే ఈ వ్యవస్త నాశనం చేయగలదు. దూరం నుంచి వచ్చే ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, మిస్సైల్స్, ఖండాంతర క్షిపణుల్ని ఇది అడ్డుకోగలదు. ఇండియా తన రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో వీటిని కొనుగోలు చేస్తోంది.

మొదటి తరువాయి



చర్చించుకుంటున్నాయి. విద్యా రంగ సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన కీలక వ్యవస్థలో పారదర్శకతకు బదులుగా వ్యక్తిగత ప్రయోజనాలు, అనధికార జోక్యాలు పెరుగుతున్నాయనే ఆందోళన కూడా ఆయన రాజీనామాకు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. "అవినీతి ఆరోపణల మచ్చలతో కొనసాగడం కంటే తప్పుకోవడమే మంచిదని భావించి ఉండొచ్చు" అనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల కమిషన్‌లో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై మురళి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఈ అంశాలపై ప్రభుత్వం గానీ, విద్యా కమిషన్ సభ్యులు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఆకునూరి మురళి కూడా తన రాజీనామా వెనుక పూర్తి కారణాలను వెల్లడించకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. విద్యా కమిషన్ వంటి కీలక సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తే పరిస్థితి రావడం ఆందోళనకరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

త్వరలోనే పైరవీల పేరుతో డబ్బుల వసూళ్ళ పై "నీలగిరి ఎక్స్‌ప్రెస్"లో పూర్తి ఆధారాలు, పత్రాలు, అంతర్గత వివరాలతో లోతైన విశ్లేషణాత్మక ప్రత్యేక కథనం...

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

మొదటి తరువాయి

ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడి దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు : తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే మేసకాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో కొన్నింటికి రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు. చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోంది : వేసవి కాలంలో భూభాగం బాగా వేడెక్కి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడు అదే సమయంలో విండ్ డైరెక్షన్లు మార్పులు వచ్చి తేమ గాలులు సముద్ర ప్రాంతం నుంచి భూ ప్రాంతాన్ని ప్రవేశించినప్పుడు మధ్యాహ్న సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతుంటాయని శ్రీనివాస్ రావు అన్నారు. దీంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగుపాటు, వడగండ్ల వాతావరణం ఉంటుందని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని వివరించారు. "నిన్న సుమారు 21 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఈరోజు తూర్పు, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది. నిన్న ఎక్కడైతే ఎక్కువ వర్షాలు పడ్డాయో అక్కడ ఈరోజు తక్కువ వర్షాలు పడే అవకాశం ఉంది. ఇవి హీట్ వేవ్ వర్షాలు కావడంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీని ప్రభావం ఉంటుంది" అని వాతావరణ శాఖ అధికారి - శ్రీనివాస్ రావు, తెలిపారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

మొదటి తరువాయి

పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

మొదటి తరువాయి

నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷లినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# వడ్ల కొనుగోళ్లు చేయాలంటూ మార్కెట్ యార్డులో రైతుల ధర్నా

**గజ్వేల్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వడ్ల కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి రైతు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను కొనుగోలు చేయకపోవడం వల్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కన్నీరు కారుస్తుంటే, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు చేస్తూ పాలనను గాడి తప్పిస్తున్నారు అని వంటేరు ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 30% వడ్లను మాత్రమే కొనుగోలు చేశారని, ఇంకా 70% వడ్లు ఐకెపి కేంద్రాల్లో నిల్వ ఉన్నాయని తెలిపారు. తడిసిన వరి ధాన్యం సహా చివరి గింజ వరకు కొనుగోలు చేసి, రైస్ మిల్లర్లకు పంపించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 45 డిగ్రీల ఎండలో రైతులు వడ్లను



కొనుగోలు కేంద్రాలకు తరలించి నిల్వ చేస్తుండగా, ఒక్కో కేంద్రంలో 40--50 లారీల వరి ధాన్యం నిల్వగా ఉందని, కానీ కొనుగోలు జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే నాలుగు--ఐదు రోజుల్లో ఆంక్షలు లేకుండా, మ్యాచార్ లేకుండా, తరుగు తీయకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని, లేకపోతే రాజీవ్ రహదారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు వెన్నెముకగా నిలిచి, గన్ని బ్యాగులు, లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచి వర్షాకాలం రాకముందే పంటలను రైస్ మిల్లర్లకు తరలించిన ఘనత ఉందని వంటేరు ప్రతాప్ రెడ్డి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రైతుల పక్షాన చివరి గింజ వరకు వడ్లను కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ పట్టుదలగా డిమాండ్ చేసింది.

## గాలి వాన భీభత్సానికి కరీంనగర్‌లో భారీ నష్టం

-- కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శ



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిన్న రాత్రి గాలి వాన బీభత్సానికి కరీంనగర్ పట్టణంలో పలు చోట్ల చెట్లు కూలి, ఇళ్లు ధ్వంసమయ్యాయి. బొమ్మకల్ 5వ వార్డులోని వడ్డెర కాలనీలో గండికోట రాజేశ్ ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో కలిసి అక్కడికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. నగరంలో హోర్డింగ్‌ల పటిష్టతపై కమిటీ ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం బొమ్మకల్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, వర్షాలకు తడిసిన ధాన్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం వడ్లకు పైసలు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. బీజేపీ ఆందోళనలతోనే కొంతమేర కొనుగోలు జరుగుతోంది అని బండి సంజయ్ విమర్శించారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు


**గన్నేరువరం, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జంగపెల్లి గ్రామంలో మహిళా వారోత్సవాల రెండవ రోజు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఉప సర్పంచ్ మంకాళి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాల్య వివాహాలపై చట్టపరమైన అంశాలు, వాటి ప్రభావం గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరగాలని, లేకపోతే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీబీఎస్ సూపర్వైజర్ కవిత, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాధినేని రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్వాడీ టీచర్లు రజిత, సరోజన, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విత్తనం కథా సంపుటికి రజనిశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ప్రతీ ఏటా అందించే రాష్ట్రస్థాయి రజనిశ్రీ సాహిత్య పురస్కారం 2026 సంవత్సరానికి రాజన్నసిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ప్రముఖ కథకుడు, సినీ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రచించిన విత్తనం కథా సంపుటి ఎంపికైంది. ఈ విషయాన్ని పురస్కార కమిటీ కన్వీనర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, కార్యదర్శి నంది శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్తంభంకాడి గంగాధర్, కోశాధికారి ముత్తినేని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ రాష్ట్రాల నుంచి 58 కథా సంపుటాలు పోటీలకు వచ్చాయని, ముగ్గురు న్యాయనిర్ణేతల ఎంపిక మేరకు విత్తనం కథా సంపుటి విజేతగా నిలిచిందని కమిటీ వివరించింది. త్వరలో జరగనున్న కార్యక్రమంలో పురస్కార ప్రదానం, నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు.

## భారీ వర్షానికి జలమయమైన అశోక్ నగర్ రోడ్లు

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా అశోక్ నగర్ పరిధిలోని రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక నివాసితులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో ప్రజలు నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల స్వల్ప వర్షానికే ఇళ్లు, దుకాణాల ముందు నీరు నిలుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని అశోక్ నగర్ ప్రజలు కోరుతున్నారు.



## ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో లైఫ్ స్కిల్స్, ఏఐ శిక్షణా కార్యక్రమాన్ని డైరెక్టర్ డాక్టర్ ఎం. రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

## బల్కా సుమన్‌పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..

**మంచిర్యాల జిల్లా మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయని "మన పిల్లలు మిలిటెంట్లు కావాలి" అంటూ ప్రజలను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బుధవారం టిపిసిసి జాయింట్ కన్వీనర్ రామిల్ల రాధిక ఆయనపై కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామిల్ల రాధిక మాట్లాడుతూ బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా నిరసనలను అణచివేసి, నిరసన తెలిపిన వారిపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. బెల్ట్ షాపుల వ్యతిరేకంగా పోరాడిన మహిళలను కూడా పోలీస్ కేసుల్లో ఇరికించి రిమాండ్‌కు పంపించారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి మళ్లీ ప్రజా ప్రతినిధిగా కొనసాగకూడదని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ హెచ్ ఓ కు ఫిర్యాదు చేసి, అక్నాలెడ్జ్‌మెంట్ స్వీకరించినట్లు తెలిపారు. బల్కా సుమన్‌పై కఠిన చర్యలు తీసుకుని, ప్రజా జీవితంలో కొనసాగకుండా అనర్హత వేటు వేయాలని ప్రభుత్వాన్ని, ఎన్నికల అధికారులను వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను సహించరని పేర్కొంటూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేటలో మహిళా వారోత్సవాల్లో భాగంగా చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు చీరలు అందజేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా మహిళలకు శిక్షణ, ఆర్థిక సహాయం అందించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రామనాథం, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మహిళా సంఘాల నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక డంపులు పట్టివేత



**కరీంనగర్ రూరల్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ డివిజన్ ఎస్సీ కాలనీ సమీపంలో అక్రమంగా ఇసుక నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ మూడు ఇసుక డంపులు కనిపించగా, సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు బొమ్మకల్‌కు చెందిన ఎడెల్లి సతీష్, సిరిసిల్ల అజయ్‌గా గుర్తించబడ్డారు. మానేరు వాగు నుండి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తవ్వి నిల్వ ఉంచి, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. పోలీసులు ఇసుకను సీజ్ చేసి పంచనామా నిర్వహించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇంతకుముందే ఎంఆర్వో ముందు బైండోవర్ అయినప్పటికీ మళ్లీ ఇదే నేరానికి పాల్పడడంతో వారిని మరోసారి బౌండ్ డౌన్ చేసి ఒక్కొక్కరికి రూ. 1,00,000 జరిమానా విధించినట్లు సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

## ప్రమాదకరంగా మారిన స్మార్ట్ సిటీ బస్సు షెల్టర్



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కోర్టు ఎదురుగా ఏర్పాటు చేసిన స్మార్ట్ సిటీ బస్సు షెల్టర్ తీవ్ర ప్రమాదకరంగా మారింది. మంగళవారం రాత్రి ఈదురు గాలుల బీభత్సానికి షెల్టర్ ఒక్కసారిగా రోడ్డు వైపునకు వంగిపోయింది. ఎప్పుడూ బస్సులు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో షెల్టర్ ఇలా వంగిపోవడంతో పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# చిన్మయ మిషన్ ఏ75 అమృత యాత్ర వైభవంగా జరగనుంది



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, దేశభక్తి విలువలను యువతలో బలపరచే లక్ష్యంతో చిన్మయ మిషన్ మరియు ఆల్ ఇండియా చిన్మయ యువ కేంద్రం నిర్వహిస్తున్న చిన్మయ అమృత యాత్ర ఈ నెల 29న కరీంనగర్‌లో వైభవంగా జరగనుంది.దేశవ్యాప్తంగా 35,000 కిలోమీటర్ల ప్రయాణంతో సాగుతున్న ఈ యాత్ర ఉద్భవిస్తున్న భారత్ అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. పూజ్య గురుదేవ స్వామి చిన్మయానంద ఆధ్యాత్మిక సందేశాలను ఆధారంగా చేసుకుని యువతలో దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.ఉదయం నుంచి రాత్రి వరకు భజనలు, గీతా పారాయణం, యువవీర్ సమావేశాలు, బైక్--కార్ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రజలు, విద్యార్థులు, మహిళలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారతీయ సంస్కృతి పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటాలని నిర్వాహకులు కోరుతున్నారు.ఈ కార్యక్రమం కరీంనగర్ వైశ్యభవన్, గాంధీ రోడ్ వద్ద మే 29న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగనుంది. మన సంస్కృతి -- మన గౌరవం అనే భావనతో ప్రతి కుటుంబం తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్షుడు చిట్టు మల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆచార్య బ్రహ్మచారి అక్షయ చైతన్య, కమిటీ అధ్యక్షుడు గంప జలంధర్, ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, నలుమాసు సుదర్శన్, కాచం రాజేశ్వర్, బట్టురి మహిపాల్ శాస్త్రి, రాచకొండ రజనీకాంత్, నలుమాచు చంద్రశేఖర్, బొడ్ల లక్ష్మీనారాయణ, చెట్ల రాజేశ్వర్, తొడుపునూరి తిరుపతి, బొడ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా పరిరక్షణకై పోరాడుదాం

**- ఎం.రఘు శంకర్ రెడ్డి**




**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ విద్యా పరిరక్షణకై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం. రఘు శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ పురాతన ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన విద్యా రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని విమర్శించారు. విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జూన్ 5, 2026న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన మేరకు విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని, జాతీయ విద్యా విధానం 2020 అమలును తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాపనను నిలిపివేయాలని, ఆకునూరు మురళి సూచించిన టి.పి.ఎస్. పబ్లిక్ స్కూళ్ల స్థాపన మానుకోవాలని, ప్రస్తుత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని కోరారు.జిల్లా అధ్యక్షురాలు సూరేపల్లి సుజాత మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, ఉపవిద్యాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, టిపిటిఎఫ్--డిటిఎఫ్ సంఘాల నాయకులు ఆవాల నరహరి, జంకె రాంచంద్రారెడ్డి, చకినాల రామ్మోహన్, వేల్పుల బాలయ్య, మాజీ అధ్యక్షులు కె. నారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఏ. దామోదర్, యు. శంకర్, ఆర్. చంద్రశేఖరరావు, ఏ. శ్రీనివాస్, తూముల తిరుపతి, జి. శ్రీనివాస్ రెడ్డి, అమృత కిషోర్, హరీష్, సి.హెచ్. రవీంద్ర కుమార్, టి. లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.జూన్ 5న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది.

# కరీంనగర్ రూరల్‌లో తాగునీటి సమస్య పరిష్కారం



**కరీంనగర్ రూరల్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బొమ్మకల్ 4వ డివిజన్ ఎస్సీ కాలనీలో మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. జాతీయ రహదారి కింద పైప్‌లైన్ దెబ్బతినడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు నివాసితులు తెలియజేయగా, ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి మున్సిపల్ కమిషనర్, మేయర్ కొలగని శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పైప్‌లైన్ మంజూరు చేసి పనులు ప్రారంభించారు.దళిత కాలనీ నీటి సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు 4వ డివిజన్ ప్రజలు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆడబిడ్డలకు కానుకగా ఇందిరమ్మ చీరలు

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నగరంలోని 36వ డివిజన్ మారుతీనగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. డివిజన్ మహిళలకు చీరలు అందజేయగా, పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.అదేవిధంగా, కరీంనగర్ రూరల్ దుర్శేడ్, గోపాల్పూర్ 4వ డివిజన్‌లో మహిళా సంఘాల ఆడబిడ్డలకు కూడా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఇందిరమ్మ చీరల పంపిణీతో నగర, గ్రామాల్లో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్‌కు నియామకం



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్ మరోసారి నియమితులయ్యారు. న్యూఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఈ నియామకం జరిగింది.ఏఐసిసి ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షుడు మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కొరివి అరుణ్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన జిల్లా అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రెండోసారి అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహకారం అందించారని పేర్కొన్నారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కరీంనగర్ జిల్లాలో ఎస్సీ విభాగ అభ్యున్నతికి కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడతానని ఆయన తెలిపారు.కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్ రెండోసారి బాధ్యతలు చేపట్టారు.

## ఘనంగా డిసిసి కార్యాలయంలో
# జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




కరీంనగర్ డిసిసి కార్యాలయంలో భారతదేశపు తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాడిన జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్మారక కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం, అంజన్ కుమార్ మాట్లాడుతూ నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపి దేశ స్వాతంత్ర్య సముపార్జనలో కీలకపాత్ర వహించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికలు, బాక్రనంగల్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి సాగు--తాగునీటి ప్రాజెక్టులు నిర్మించి, ఐఐటీలు, ఎయిమ్స్ వంటి విద్యా సంస్థలను స్థాపించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని వివరించారు.నెహ్రూ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని, పార్టీ కార్యకర్తలు ప్రజా సేవలో అదే మార్గంలో నడుస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, మడుపు మోహన్, ముత్యం శంకర్ గౌడ్, ఉప్పుల అంజనీ ప్రసాద్, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్, వంగల విద్యాసాగర్, సువీన్ యాదవ్, మూల రవీందర్ రెడ్డి, రూపు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గడప శ్రీనివాస్, సరిల్ల రతన్ రాజు, నిహాల్, కంకణాల అనిల్, విక్టర్, అమీర్, ఇమ్రాన్, కుంభాల రాజు కుమార్, శిల్ప, లాయికు, సత్తినేని శ్రీకాంత్, మేకల నరసయ్య, గడ్డం శ్రీరామ్, మంద మహేష్, మాజీద్ అలీ ఖాన్, వీరదేవేందర్, ఇమ్రాన్ గని తదితరులు పాల్గొన్నారు.జవహర్‌లాల్ నెహ్రూ సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

## షాద్ నగర్ డిపోకు
# 8 సిటీ బస్సులు

**-ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**









**షాద్ నగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో నూతనంగా మంజూరైన 8 సిటీ బస్సులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "షాద్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ సర్వీసులు అందించడమే మా లక్ష్యం. ప్రతి పల్లెకు బస్సు వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం ఉష, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజు నాయక్, దిలీప్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, మురళీమోహన్ (అప్పి), కో-ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, ముబారక్ అలీ ఖాన్, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, అంబటి ప్రభాకర్, శ్రీశైలం గౌడ్, చందు నాయక్, మహమ్మద్ ఇబ్రహీం, కరుణాకర్, నాగమణి, మంజుల, మంగ అశోక్, రవితేజ, నీ రటి వాసు, షఫీద్దిన్, జాంగరీ రవి, జగదీష్ మహమూద్, శంకర్, తుపాకుల శేఖర్, బాబు నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీలుగు విత్తనాల పంపిణీ ప్రారంభం

**హుస్నాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బిల్ల వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి అధిక దిగుబడులు సాధించేలా సంఘం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.రైతులు శాస్త్రీయ విధానాలతో సాగు చేసి ప్రభుత్వ సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.నాణ్యమైన విత్తనాల పంపిణీతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం
# చేస్తే కఠిన చర్యలు తప్పవు

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పారిశుద్ధ్య విభాగం సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, జవాన్లతో సమీక్ష నిర్వహించిన ఆయన, నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, అకాల వర్షాల పట్ల అప్రమత్తత, ముందస్తు జాగ్రత్తలు, ఇంకుడు గుంతల గుర్తింపు, ఆన్లైన్ నమోదు వంటి అంశాలపై చర్చించారు.పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు.

# కార్పొరేటర్లు అవినీతికి పాల్పడొద్దని బండి సంజయ్ హెచ్చరిక



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ కార్పొరేటర్లు అవినీతికి పాల్పడొద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రజలు ఆశీర్వదించి కార్పొరేషన్‌ను బీజేపీకి అప్పగించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్పొరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన, మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో పాటు కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. అవినీతికి తావులేకుండా పని చేస్తే మరో పదేళ్లు బీజేపీ అధికారంలో ఉంటుంది అని ఆయన హితవు పలికారు.యూసీఎఫ్ స్కీం కింద కరీంనగర్‌కు రూ.840 కోట్లు మంజూరయ్యాయని, అవినీతి లేకుండా అభివృద్ధి పనులు చేపట్టి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్పొరేషన్‌లో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కార్పొరేటర్లు తెలియజేయగా, అవినీతిపరులపై చర్యలకు వెనుకాడబోం అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ధాన్యం కొనిగోలుపై తప్పుడు ప్రచారం నమ్మవద్దు

**– ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**మానకొండూర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సదాశివపల్లి గ్రామంలో మహిళా సంఘాలకు చీరలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అపోహాలు వీడాలని సూచించారు.వెల్ది గ్రామంలో వీవో భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన, మహిళల స్వావలంబన ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.అదే రోజు మండల కేంద్రంలోని రైతు వేదికలో 92 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 25వ విడతలో రూ.22.87 లక్షలు మంజూరై లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉప కమిషనర్ వేణుమాధవ్, ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ విజయకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత



**కరీంనగర్ రూరల్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగునూరులో ముకేష్ కుమార్ తన ఇన్ఫినిక్స్ సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను గోదాంగడ్డలో ట్రేస్ చేసి పట్టుకున్నారు.తదుపరి ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఫోన్‌ను యజమాని ముకేష్ కుమార్‌కు అందజేశారు. ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం సభ్యులు కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి, పద్మజలను ఆయన అభినందించారు. పోలీసుల సాంకేతిక వినియోగం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోంది.

# వివేక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్

**కూకట్పల్లి మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావుకి , మాజీ కార్పొరేటర్ శిరీష బాబురావు కి, జోనల్ కమిషనర్ కి డిప్యూటీ కమిషనర్ కి ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ సార్ యు బి డి మేనేజర్ శివ జ్యోతి కి,సమత కి ధన్యవాదములు స్మశాన వాటిక యందు గ్రీనరీ ఏర్పాటు చెట్లు, పువ్వులు మొక్కలు ఏర్పాట్లు జరుగుచున్నవి యొక్క పనులను వివేక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్యపాగ శ్రీనివాస్ ఎం ఏ , ప్రధాన కార్యదర్శి వల్లూరి అనిల్ కుమార్ , కాంట్రాక్టర్ జయరామిరెడ్డి బాలకృష్ణ ఆర్గనైజర్ సెక్రెటరీ ప్రారంభమైనటువంటి పనులను పరిశీలించడం జరిగినది.



# రెండు రోజుల్లో వరి కొనుగోలు పూర్తి చేయాలని గంగుల హెచ్చరిక

**కరీంనగర్ రూరల్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నియోజకవర్గంలో రైతులు పండించిన వరి ధాన్యం రెండు రోజుల్లో కొనుగోలు చేయకపోతే జిల్లా అధికారుల ఇండ్ల ఎదుట పోస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.నగునూరు వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయనకు రైతులు తమ గోడును వెల్లగక్కారు. నెలన్నరగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో వర్షానికి తడిసిపోయిందని, కొనకపోతే ఆత్మహత్య శరణం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గంగుల వెంటనే అదనపు కలెక్టర్‌తో మాట్లాడి ఏఎంసీ గోదాం నెంబర్ 7ను నిల్వ కోసం కేటాయించాలని కోరారు. సివిల్ సప్లై అధికారులను కేంద్రానికి పిలిపించి సమస్యలపై నిలదీశారు. హమాలీలు, లారీలు లేకపోవడంతో రవాణా కష్టాలు ఉన్నాయని అధికారులు చెప్పగా, గ్రామంలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి, కూలీలను సమకూర్చి ధాన్యం తరలింపునకు కృషి చేశారు.తదుపరి చేగూర్తి గ్రామంలో కూడా తడిసిన ధాన్యం పరిస్థితిని పరిశీలించిన గంగుల, రైతులకు ధైర్యం చెప్పి, అక్కడే అధికారులతో ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, గన్ని సంచులు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా వాహనాల కొరత స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో మే 5లోగా కొనుగోళ్లు పూర్తి చేసి రైతులకు డబ్బులు చెల్లించామని, కాంగ్రెస్ పాలనలో మే చివరికి వచ్చినా 50 శాతం కూడా కొనుగోలు జరగలేదని అన్నారు.రెండు రోజుల్లో తడిసిన, తడవని ప్రతిగింజను కొనుగోలు చేయాలని, లేకపోతే అధికారుల ఇండ్ల ముందు పోసి ఆందోళన చేపడతామని గంగుల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, తోట తిరుపతి, లక్ష్మయ్య, మహేందర్, సుంకిశాల సంపత్ రావు, రంగారెడ్డి, కోటేశ్వర్, వినయ్, అరే శ్రీకాంత్, భద్రయ్య, రామ్ రెడ్డి, నేతి రవి వర్మ, పలువురు బారసా నాయకులు పాల్గొన్నారు.




# ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం



**హుస్నాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకుడు మంద కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రతి మండలం, గ్రామంలో కొత్త కార్యవర్గాల ఎన్నికల నిర్వహణపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు గాదపాక రవీందర్, బత్తుల సరూప రవీందర్, గడిపే సంపత్‌లను శాలువాలతో సన్మానించారు.హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ప్రకాష్ మాదిగతో పాటు నాయకులు పాల్గొన్నారు.గ్రామ స్థాయి కమిటీల బలోపేతంపై ఎమ్మార్పీఎస్ దృష్టి సారించింది.

# వ్యవసాయ మార్కెట్లో దుర్గంధం, దోమల బెడద



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పారిశుద్ధ్య లోపాలు రైతులు, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడంతో యార్డ్ అంతా దుర్వాసన వ్యాపిస్తోంది. టాయిలెట్లలో నీటి సౌకర్యం లేకపోవడం, రాత్రివేళల్లో దోమల బెడదతో జ్వరాలు వస్తున్నాయని రైతులు వాపోయారు. రోజుల తరబడి అసౌకర్యాల మధ్య గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన వారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన వసతులు కల్పించాలని కోరుతున్నారు.రైతులు పారిశుద్ధ్య సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బక్రీద్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం

**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్, పోలీస్, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. స్లాటర్ హౌస్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ, వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డులకు తరలించడం, ఆవులు--దూడల వధ పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, పశువుల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి.




# ఘనంగా బెల్లి లలితక్క వర్ధంతి నిర్వహణ



**హుస్నాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల, ఉద్యమ అమరురాలు బెల్లి లలితక్క 27వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆమె సేవలను స్మరించారు. కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లలితక్క అమరత్వంతో తెలంగాణ ఉద్యమం మరింత బలపడిందని, మేకల వీరన్న యాదవ్ ఆమె గ్రామాల్లో పర్యటించి ప్రజల్లో చైతన్యం కల్పించారని గుర్తుచేశారు. డ్యాగల సారయ్య ఆమె సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల గుర్తింపు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని నిర్ణయించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దండి లక్ష్మి, కౌన్సిలర్ గాదెపాక రవీందర్, కేడం లింగమూర్తి, సుద్దాల చంద్రయ్య, ఆకుల వెంకట్, ఎడబోయిన తిరుపతిరెడ్డి, వంగ వెంకట్రాంరెడ్డి, గడిపే మల్లేష్, పందిళ్ల శంకర్, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, బండి పుష్పరాజ్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, నాంపల్లి సమ్మయ్యతో పాటు అనేక మంది పాల్గొన్నారు. లలితక్క సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

**గంగాధర, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త విద్యా సంవత్సరానికి ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది.మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ పాఠశాలలు తెరుచుకునే రోజుకే ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థుల నమోదు పెంపుదల కోసం మే 11 నుండి జూన్ 13 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తనాజీ వాకడే మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరుగుతోందని వివరించారు.పాఠశాల గంట మోగేలోపే విద్యార్థుల చేతిలో పుస్తకాలు ఉండేలా గంగాధర మండలంలో పంపిణీ ప్రారంభమైంది.




## అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

**– కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా అధికారులకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ఇంకా లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి కేంద్రంలో వివరాలు సేకరించి కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డీఎం నాగరాజు, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం




**గంగాధర, మే 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండలో రూ.50 కోట్లతో మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాజకీయాలను పక్కనపెట్టి కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని, చొప్పదండి నియోజకవర్గమే దానికి నిదర్శనమని అన్నారు. రవాణా సౌకర్యాలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని, ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి రోడ్ల నిర్మాణానికే ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. గత ఏడు సంవత్సరాల్లో కరీంనగర్ పార్లమెంట్‌కు రూ.20 వేల కోట్లకుపైగా నిధులు తెచ్చి, అందులో రూ.7 వేల కోట్లకుపైగా రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేశామని చెప్పారు. కరీంనగర్--వరంగల్, ఎల్కతుర్తి--సిద్దిపేట జాతీయ రహదారులు శరవేగంగా పూర్తి అవుతున్నాయని, కరీంనగర్--జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ప్రజల అభివృద్ధే లక్ష్యమని, అన్ని పార్టీల నాయకులు కలిసి పనిచేస్తే కరీంనగర్ పార్లమెంట్‌ను దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని బండి సంజయ్ అన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు - కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూన్ 2న జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన ఆమె, పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు సీటింగ్, వసతులు, ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార స్టాల్స్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని, ఆస్తులు, రుణాల పంపిణీ, మహిళలకు బ్యాంకు లింకేజీల వంటి కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, డిసిపి వెంకటరమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరగనుంది.

## అక్రమ రవాణాపై సీపీ గౌష్ ఆలం ఉక్కుపాదం



**కరీంనగర్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఇసుక, పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హుజురాబాద్, జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో నాగంపేట, కోరపల్లి గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను సందర్శించిన ఆయన, రికార్డులను పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. ఇసుక అక్రమ రవాణా ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. నిర్లక్ష్యం సహించేది లేదు అని ఆయన స్పష్టం చేశారు. అలాగే హుజురాబాద్ పరకాల క్రాస్ రోడ్డు వద్ద పశువుల అక్రమ రవాణా నిరోధక చెక్‌పోస్టును పరిశీలించారు. భారీ కంటైనర్లు, అనుమానాస్పద వాహనాలను రాత్రి పగలు తేడా లేకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్థానిక ఇన్స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో అక్రమ రవాణా అరికట్టడంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీపీ గౌష్ ఆలం దిశానిర్దేశం చేశారు.

# రూపాయి పతనంతో విదేశీ విద్యార్థుల బతుకు భారం

**ఆవేదన వ్యక్తం చేసిన కప్పాటి పాండురంగా రెడ్డి**



**రంగారెడ్డి, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి విలువ క్షీణించడం కేవలం ఆర్థిక గణాంకాలకే పరిమితం కాకుండా, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న లక్షలాది భారతీయ విద్యార్థుల జీవితాలను చీకట్లోకి నెడుతోందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై చదువుకుని కుటుంబాలకు అండగా నిలవాలని ఆశలతో వెళ్లిన సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు నేడు చదువు కంటే "రోజు ఎలా గడవాలి? మనుగడ ఎలా సాగించాలి?" అనే దైన్య స్థితికి చేరుకోవడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. రూపాయి బలహీనతతో జీవన వ్యయం భరించలేనంతగా పెరిగిపోయిందని, తల్లిదండ్రులు పంపే డబ్బు కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదని వివరించారు. సంపన్న కుటుంబాల పిల్లలు మినహా, మిగిలిన విద్యార్థులు ఒక పూట భోజనం, కిలోమీటర్ల నడక, కష్టతరమైన పార్ట్‌టైమ్ పనులతోనే జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలితో అలమటిస్తూ, బతుకుదెరువు కోసం పోరాడుతున్న విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఇది వారి ఆరోగ్యాన్ని, విద్యా నైపుణ్యాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని హెచ్చరించారు. "డాలర్‌తో రూపాయి పతనాన్ని కేవలం ఆర్థిక కోణంలో కాకుండా, దీని వెనుక ఉన్న మానవీయ కోణాన్ని గుర్తించాలి. విదేశాల్లోని భారతీయ విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు లేదా ప్రత్యేక స్కాలర్‌షిప్ మార్గాలను పరిశీలించి ఆదుకోవాలి" అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# పోస్టల్ చార్జీలు రూ.50 వరకు చెల్లించనక్కరలేదు

**-బీపీఎల్ కార్డుదారులకు సమాచారం ఉచితం**
**-- డా. కొర్ర. కిషన్ నాయక్**






**డా,, కొర్ర. కిషన్ నాయక్**
**RTIAS రాష్ట్ర అధ్యక్షులు**
**ఫోన్ నెం 9885122005**

**దేవరకొండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బీపీఎల్ కార్డుదారులు ఎన్ని పేజీల సమాచారాన్నైనా ఉచితంగా పొందవచ్చని ఆర్‌టిఐ ఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర. కిషన్ నాయక్ స్పష్టం చేశారు. చాలా మంది ప్రజా సమాచార అధికారులు దరఖాస్తు రుసుము మాత్రమే మినహాయింపు, కానీ సమాచారం పేజీకి రూ.2 చొప్పున చెల్లించాల్సిందేనంటూ తప్పుగా అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది చట్టానికి విరుద్ధమని, బీపీఎల్ కార్డుదారులు దరఖాస్తు రుసుముతో పాటు కోరిన సమాచారాన్ని కూడా పూర్తిగా ఉచితంగా పొందే హక్కు కలిగి ఉన్నారని వివరించారు. అదేవిధంగా, దరఖాస్తుదారుకు పంపే సమాచారం కోసం రూ.50 వరకు పోస్టల్ చార్జీలను అధికార యంత్రాంగమే భరించాల్సి ఉంటుందని, రూ.50 దాటితే మాత్రమే అదనపు రుసుము దరఖాస్తుదారు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం -- 2005 నిబంధనలు, 2012లో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు, అలాగే కేంద్ర సమాచార కమిషన్ తీర్పులు స్పష్టంగా ధ్రువీకరించాయని ఆయన గుర్తు చేశారు. గతంలో కూడా బీపీఎల్ కార్డుదారులకు సమాచారం కాపీలు, పోస్టల్ ఛార్జీలు ఉచితమని కేంద్రం ఆఫీసు మెమోరాండం ద్వారా పేర్కొన్నట్లు వివరించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే కాబట్టి, వారు కూడా దరఖాస్తు రుసుము నుంచి మినహాయింపు పొందుతారని, రేషన్ కార్డు జిరాక్స్‌ను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై సలహాలు, సూచనల కోసం 9885122095 నంబరును సంప్రదించవచ్చని డా. కిషన్ నాయక్ తెలిపారు.

# పాఠశాల విద్యను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం

**- ఎబివిపి**




**దేవరకొండ మే 27. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అనంతరం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంపై చర్చించారు. నీళ్లు నిధులు నియామకాల కోసం ఆనాడు ప్రత్యేక తెలంగాణ కొరకు ఎంతోమంది విద్యార్థులు బలిదానాలు అర్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కోరుకున్న ప్రత్యేక తెలంగాణ లో ఈరోజు చూసుకున్నట్లయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా గాలికి వదిలేసిందని ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు బ్రాండ్ల పేరిట ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ నర్సరీ విద్యార్థులకు లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారని పుస్తకాలు యూనిఫాం ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుండి ఫీజు దోపిడీకి పాలు పడుతున్నారని, బస్సు సౌకర్యం పేరిట అడ్డదారిన వేలు రూపాయలను వసూళ్లు చేస్తున్నారని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, వసతి గృహాలు మాత్రం అరకొర వసతులు, సౌకర్యాలతో నరక కూపాల్లా ఉన్నాయి అని మరో రెండు వారాల్లో పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్న ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాల ఊసు అసలే లేదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతూ రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య పడిపోతుంటే మరో వైపు ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరించి విద్యను వ్యాపారం చేస్తున్నాయి అని ఈ విషయంలో పట్టించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారని అరి కట్టి, ప్రభుత్వ పాఠశాలను మెరుగు పరుస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను, వసతి గృహాల వసతులను అభివృద్ధి పరిచి పాఠశాల విద్యలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి భారీ విద్యార్థి ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర కార్యదర్శి పగిళ్ల విక్రం, నగర జాయింట్ సెక్రెటరీ రాకేష్, గుండాల శివరామరాజు, అరవింద్, శంకర్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

**- సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి**
**- విఓఏల ధర్నాకు మద్దతు తెలిపిన ఎల్ఎన్ రెడ్డి**



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ వ్యాప్తంగా ఏండ్ల తరబడి పనిచేస్తున్న వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏలు) చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన బుధవారం హాజరై, వారికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీఓఏలు ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడం సరికాదన్నారు. వీఓఏల వేతనాలు 20,000 వరకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జిఓ నెం:58 కి సవరణలు చేయాలని మరియు గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివోఏలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని, పరిష్కారమయ్యే వరకు పార్టీ తరపున మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కవిత, మండల ప్రధాన కార్యదర్శి ప్రమీల, మండల జ్యోతి, వివోఏలు చంద్రశేఖర్, వినోద్, లావణ్య, వనిత, శైలజా, మండల పరిధిలోని వీఓఏలు, నాయకులు మాదారం గణేష్ గౌడ్ గుర్లకుంట రవి నాయక్, గురిగల్ల రామచంద్రయ్య, కోసిక యాదయ్య, ముస్లి మహేష్, సిద్దిగారి వెంకటేష్, మాధారం మహేష్ గౌడ్, గుడెపు మహేష్, జర్పుల పాండు నాయక్, రాజు తదితరులు ఉన్నారు.

## ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ ఎన్నికలు

-అధ్యక్షుడిగా జాంగిర్ బాబా, కార్యదర్శిగా గోరేటి సాయికుమార్



**దేవరకొండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా డిండి మండలం యర్రరం గ్రామంలో ట్రాక్టర్ యాజమాన్యులు బుధవారం ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులకు వెళ్లే ప్రతి ట్రాక్టర్ ఒకే ధరకు సేవలు అందించాలని, నిర్ణయించిన ధరకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.5 వేల జరిమానా విధించాలని తీర్మానం చేశారు. తదనంతరం ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ ఎన్నికలు నిర్వహించగా, అధ్యక్షుడిగా మహమ్మద్ జాంగిర్ బాబా, కార్యదర్శిగా గోరేటి సాయికుమార్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా మహమ్మద్ ఫయాజ్, ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ జంగయ్య, సహాయక కార్యదర్శిగా మహమ్మద్ జమీర్, కోశాధికారిగా గోరటి జంగయ్య, సలహాదారులుగా నారమోని కొండల్, హైమత్, చంద్రశేఖర్, ఎస్. జంగయ్య ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ మాసం బాబా, అజిజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బురాన్ ఖలీలుల్లా, జంగయ్య జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి--త్యాగ--సహనాలకు ప్రతీక 'బక్రీద్'

-ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**దేవరకొండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భక్తి, త్యాగం, సహనం ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే ప్రధాన సందేశం" అని పేర్కొన్నారు. ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, "అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలి" అని ఆకాంక్షించారు.


## అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి

--టీపీటీఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో సుమారు 16 వేల పైచిలుకు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, వాటిలో అన్ని పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. 2025--26 విద్యా సంవత్సరంలో 1362 ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించగా, ప్రస్తుత 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఆర్.సి. నెం. 83024, తేది 26--05--2026 ద్వారా కేవలం 2769 పాఠశాలల్లో మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా సుమారు 12 వేల పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు లేవని, ప్రతి సంవత్సరం కొద్దికొద్దిగా అనుమతులు ఇవ్వడం వల్ల ఆశించిన మేరకు ప్రాథమిక విద్య బలోపేతం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం తగు ఉత్తర్వులు జారీ చేయాలి. అనుమతి ఇవ్వడమే కాకుండా, బోధించడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. ప్రాథమిక విద్య బలోపేతానికి తగినంత బడ్జెట్ కేటాయించాలి" అని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

# నేడు బక్రీద్


- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు





**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గంలో బక్రీద్ కు మసీదులు, ఈద్గాలు ముస్తాబు చేశారు. గురువారం పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి తదితర మండలాల్లో ఏర్పాట్లు చేశారు. ఇస్లాం క్యాలెండర్లోని బక్రీద్ మాసంలో 11వ రోజు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. త్యాగనీరతికి ప్రతీకగా ముస్లింలు పండుగ జరుపుకుంటారు. పండుగ రోజు జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండుగను త్యాగానికి ప్రతీకగా ఆమనగల్లు మత గురువు అబ్దుల్ వాహెద్ పేర్కొన్నారు. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాల్లో సహనం వహిస్తూ త్యాగనీరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉందని, ప్రతీ ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని తెలిపారు. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని జామియా ఇస్లామియా దారుల్ ఉలూమ్ కైసర్ మదర్స మౌలానా అబ్దుల్ కరీం పేర్కొన్నారు.

# రైతు సమస్యలపై రాజకీయాలు చేయొద్దు-- రైతు కమిషన్




**హైదరాబాద్, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకొని ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని రైతు కమిషన్ హెచ్చరించింది. కమిషన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో చైర్మన్ కొదండరెడ్డి, సభ్యులు గడుగు గంగాధర్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం వడ్లు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. రైతులకు బాసటగా నిలవాల్సిన నాయకులు వారిని మానసికంగా దెబ్బతీసేలా మాట్లాడకూడదు" అని సూచించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ మద్దతు ధరల వ్యవస్థలో ఉన్న 23 పంటల కొనుగోళ్ల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరగాల్సిన బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 57.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. "2014 నుంచి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలు పెరిగాయి" అని విమర్శించారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, విత్తనోత్పత్తిలో తెలంగాణ వాటా 40--45 శాతం ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ కాలంలో "సెల్ఫ్ సర్టిఫికేషన్" విధానం పెద్ద తప్పిదమని, రైతులను రక్షించేలా కఠిన జీవో అవసరమని సూచించారు. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఆదాయం పెరిగేలా పంటల వైవిధ్యీకరణపై ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ, "రైతులతో కలిసి ఉండాల్సిన వారు యాత్రల పేరుతో రాజకీయాలు చేయడం బాధాకరం. కొన్ని ప్రాంతాల్లో ఆలస్యాలు ఉన్నా, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోళ్లు సమర్థవంతంగా జరుగుతున్నాయి" అని వివరించారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య



**వెల్దండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మండల ఎంపీడీవో కృష్ణయ్య పరిశీలించారు. ఈదులకుంట చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను సందర్శించి, వేసవి కాలంలో కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. "ప్రతి రోజు ఉదయం 6 గంటల వరకు పనికి వచ్చి, కొలతల ప్రకారం పని ముగించుకొని త్వరగా ఇంటికి వెళ్లాలి" అని కూలీలకు సూచించారు. ఎన్ఎంఎంఎస్ అటెండెన్స్ తప్పనిసరిగా పూర్తి చేయాలని మేట్‌కు ఆదేశించారు. పనిప్రదేశంలో నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేసినందుకు సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. అదనంగా, గ్రామంలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ, సెగ్రిగేషన్ షేడ్, వైకుంఠ ధామం, వీధుల శుభ్రత, మురుగు కాల్వల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, హరిణి, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, మేట్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ ఏర్పాట్లు పరిశీలించిన మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్



**కల్వకుర్తి, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బక్రీద్ పండుగ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో ఏర్పాట్లను మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలి" అని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిమ్మల శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్లు మబ్బు రామరాజు, షేక్ ఎజాస్, రమాకాంత్ రెడ్డి, మక్బూల్, నాయకులు సోఫీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు, సోదరిమణులకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ జుబేర్.



**సంగారెడ్డి మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కంది మండల జులకల్ గ్రామ ముస్లిం సోదరులకు, సోదరిమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ జుబేర్. త్యాగానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ అని దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ చేసుకునే పండుగ బక్రీద్ అన్నారు. ఈ పండుగ రోజు ముస్లింలు తమకున్న దానిలో పేదలకు దానం చేయడం గొప్ప విషయం అని సర్పంచ్ జుబేర్ అన్నారు

## బక్రీద్‌కు కట్టుదిట్టమైన బందోబస్తు

-ఈద్గా వద్ద ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బక్రీద్ పండుగ సందర్భంగా మునుగోడు రోడ్డులోని ఈద్గా ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా పరిశీలించారు. గురువారం భారీగా తరలిరానున్న ముస్లిం సోదరుల కోసం ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు, తాగునీటి ఏర్పాట్లను సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ, "ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి సామరస్య వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ ఆది రెడ్డి, 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ ఆమేర్, కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## గుర్తింపు లేని పాఠశాలలపై కఠిన చర్యలు

-జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి



**నల్లగొండ ,మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలను తక్షణమే మూసివేయాలని డీఈఓ బిక్షపతి ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించవద్దని సూచించారు. అలాగే, పాఠశాలల ప్రాంగణాల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి వస్తువులను అధిక ధరలకు విక్రయించకూడదని అధికారులను ఆదేశించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కనగల్ ,మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కనగల్ మండల పరిధిలోని దోరెపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి విద్యను అభ్యసించిన 1994-2002 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఒక ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు 24 సంవత్సరంల తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విద్యార్థులు పాల్గొని ఒకరిని ఒకరు మర్యాదపూర్వకంగా కలిసి యోగాక్షేమాలు తెలుసుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు 24 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తమకు విద్యనభ్యసించిన హెడ్మాస్టర్ యాదగిరి,ఉపాధ్యాయులు రామ లక్ష్మయ్య సుకుమారి ,సుజాత సేవలను గుర్తు చేసుకున్నారు ఉపాధ్యాయులు, ఎండి ఆసిఫ్ , ఏంరెడ్డి బిక్షం రెడ్డి , మాదగాని ఏడు కొండలు ,అప్పటి విద్యా కమిటీ చైర్మన్ సుంకిరెడ్డి చంద్రారెడ్డి ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కవిత, సుమలత సునిత, సరిత, వసుమతి, యాదమ్మ , ప్రేమలత, శ్రావణి రెడ్డి, హైమావతి, సాగరిక, రేణుక,పల్లపు వెంకన్న, బక్క రాజశేఖర్, అయితగాని రమేష్, భైరగాని శ్రీను,మన్యం రమేష్, కిన్నెర సైదులు, వెంకన్న, సాగర్, లింగస్వామి, నరేష్, ఏడుకొండలు, బాలరాజు, నరేష్, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రెండు కాళ్లు కోల్పోయిన వ్యక్తికి అండగా నిలిచిన.. సీనియర్ జర్నలిస్టు నాగరాజు గౌడ్



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన చలమల్ల రామస్వామి గౌడ్ ఇట్టి వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వైద్యులు రెండు కాళ్లు తొలగించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న కొట్ర గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్టు, న్యూట్రిషన్ వెల్ నెస్ కోచ్ నాగరాజు గౌడ్ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితున్ని పరిస్థితి తెలుసుకున్న నాగరాజు గౌడ్ పలువురు మానవతా వాదుల ఆర్థిక సహకారంతో బుధవారం రామస్వామి కి రూ .12 వేలు నగదు అందజేశారు. ఈ సాయాన్ని ఆదర్శంగా తీసుకొని మరింత మంది సాయం చేసేందుకు ముందుకు రావాలనే ఉద్దేశంతో సహకారం అందించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన మండల గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్, మట్ట విష్ణు గౌడ్ ఆర్మీ, పోతేపల్లి జగన్ గౌడ్, మట్ట రఘు గౌడ్, మట్ట చంద్రకాంత్ గౌడ్, రాచూర్ మహేష్ గౌడ్, చెదురుపల్లి రామచందర్ గౌడ్, పోతేపల్లి ఆంచ కృష్ణ గౌడ్, చెర్కూర్ రామకృష్ణ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాస్టర్ కుమార్, నాగేష్ గౌడ్, భూషరాజు బాలస్వామి, రవీందర్ యాదవ్, అశోక్ గౌడ్, వెంకటయ్య గౌడ్, తిరుపతయ్య గౌడ్, యువరాజ్ గౌడ్, లక్ష్మోజి ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహిళలు కేవలం గృహిణిలుగానే పరిమితం కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా రాణించాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళ క్యాంటీన్ వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు యాదవ్, మొక్తల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, నాగిళ్ళ జగన్, ఎనుముల్ల రమేష్, నిరంజన్, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖాదర్, అల్లాజీ గౌడ్, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, నాయకులు దేవరశెట్టి మహేష్, ఆర్.పీ లు విజయలక్ష్మి, శ్రీరామ్, పుష్ప, స్వాతి, చంద్రకళ, అలివేలు, మంజుల, మనీషా, పాపయ్య, పద్మ, జ్యోతి, మహేందర్ తదితరులు ఉన్నారు.

## రైతులు అధైర్యపడొద్దు

**- వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి**
**- చివరి గింజ వరకు కొంటాం**



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి భారీ ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన వడ్లు తడిసిపోయిన నేపథ్యంలో బుధవారం వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని సూచించారు. తమ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆయన వెంట డైరెక్టర్లు తాళ్ళ రవీందర్, పల్లె జంగయ్య, సంపత్ కుమార్, రమేష్ గౌడ్, ఏఈఓ లు బాలకృష్ణ, నిఖిత, సింగల్ విండో సిబ్బంది దేవేందర్ తదితరులు రైతులు ఉన్నారు.

# మామిడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**- మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి**



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కడ్తాల్ మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పలు దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించి, నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంవత్సరమంతా కష్టపడి, పెట్టుబడులు పెట్టి చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలులు ముంచేయడంతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఈ ప్రకృతి వైపరీత్యం మరింత శాపంగా మారిందని అన్నారు. ప్రభుత్వం అలసత్వం వీడి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, మండల వ్యాప్తంగా దెబ్బతిన్న మామిడి తోటల నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి మామిడి రైతుకు ఎకరాకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని, నేలరాలిన కాయలను అమ్ముకోవడానికి రైతులకు రవాణా సౌకర్యం మరియు మార్కెట్‌లో మద్దతు ధర లభించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకొని ధైర్యం కల్పించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు, బాధిత రైతులు ఉన్నారు.

## నాలుగు నెలలు కూడా నిలవని తారు రోడ్డు

**ప్రజాధనం వృథా -- కలెక్టర్‌కు వినతి**





**ఎలిగేడు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోటి 25 లక్షల రూపాయలతో నిర్మించిన కొదురుపాక--ముప్పిరి తోట గ్రామాల మధ్య తారు రోడ్డు నాలుగు నెలలు కూడా నిలవకుండా ధ్వంసమైంది. గత సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా హడావిడిగా, నాణ్యత లేకుండా నిర్మించిన ఈ రోడ్డు, ఇటుక బట్టీల మట్టి తరలింపుతో పూర్తిగా పాడైపోయింది. కొదురుపాక చెరువులో మట్టి పర్మిషన్ తీసుకున్న కొందరు వ్యక్తులు పరిమితులను మించి హెవీ లోడ్ లారీలతో తరలించడం వల్ల రోడ్డు దెబ్బతిన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిట్టూరు--నిమ్మనపల్లి మార్గం అడ్డంకులు ఎదురవడంతో, లారీలు ఈ మార్గాన్ని ఎంచుకోవడం సమస్యను మరింత పెంచిందని గ్రామస్తులు తెలిపారు. "కోటి 25 లక్షల ప్రజాధనం వృథా అయింది. దీనిపై ఎవరు సమాధానం చెబుతారు?" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ముప్పిరి తోట గ్రామస్థులు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మట్టి కాంట్రాక్ట్ తీసుకున్న వారినుంచే నష్టాన్ని రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆషాడపు వెంకటేష్, నారగోని విజయ్ కుమార్, కోట సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జీలుగా విత్తనాల పంపిణీ

**--రైతులకు 50% సబ్సీడీపై అందజేత**



**ఎలిగేడు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని సహకార సంఘంలో బుధవారం రైతులకు జీలుగా విత్తనాలను 50% సబ్సీడీపై అందజేశారు. ఈ కార్యక్రమం విండో అధ్యక్షుడు గోపు విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జీలుగా పంట మట్టి ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా, దిగుబడులను కూడా మెరుగుపరుస్తుంది" అని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, కరివేద సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, రైతులు నరహరి మోహన్ రెడ్డి, పుల్లారావు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## శరవేగంగా కొనసాగుతున్న కోహెడ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమ పనులు



**రంగారెడ్డి జిల్లా, మే 27( నీలగిరి ఎక్స్ ప్రెస్)**



జూన్ 3 వ తేదీన తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మరియు పాలకవర్గం, అధికారులు కోహెడ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నూతన సమీకృత మార్కెట్ వస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జ౯,భాస్కర చారి, సభ్యులు గణేష్ నాయక్, మధుసూదన్ రావు,అంజయ్య,నవరాజ్, రఘుపతి రెడ్డి,నర్సింహ, లక్ష్మి, వెంకటేశ్వర్లు గుప్త తో పాటు మార్కెట్ కార్యదర్శి ౫,శ్రీనివాస్ తో పాటు మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పవిత్రమైన బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ లభించాలని ఆయన ఆకాంక్షించారు. త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ.. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందని కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

## భక్తి--త్యాగ--సహనాలకు ప్రతీక 'బక్రీద్'

**ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు**



**వెల్దండ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చేర్కూర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భక్తి, త్యాగం, సహనం ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్‌ను జరుపుకుంటారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే ప్రధాన సందేశం" అని పేర్కొన్నారు.

# టిడిపి మహిళలకు అన్ని విధాల చేయూత

-నందికొట్కూరులో మహానాడు కార్యక్రమం








**నందికొట్కూరు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్య, ఉద్యోగం, ఆర్థిక రంగాల్లో మహిళలకు చేయూతనిచ్చేలా టిడిపి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం "స్త్రీ శక్తి", ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం "దీపం 2.0", డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు "స్వయం ఏపీ" ద్వారా బ్రాండింగ్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. "టిడిపి విజయంలో మహిళలదే కీలక పాత్ర. అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేశాం" అని వారు స్పష్టం చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణం బ్రాహ్మణకొట్కూరు క్లస్టర్ నెం. 2, 5, 6 ఆధ్వర్యంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో మాండ్ర శివానందరెడ్డి టిడిపి జెండాను ఆవిష్కరించి, పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ మహానాడు అబ్జర్వర్ వెంకట శివుడు యాదవ్, మండల కన్వీనర్ మాండ్రా సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీర ప్రసాద్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హరి సర్వోత్తమ్ రెడ్డి, యువ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి, బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జీలు, మహిళా నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, కేఎస్ఎస్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ బందోబస్తు ఏర్పాట్లపై స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





**నంద్యాల, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ బుధవారం వెలుగోడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, నమోదైన కేసులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, ఫిర్యాదిదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల పరిస్థితులు, నేరాల నియంత్రణపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, శాశ్వత పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. సిబ్బంది విధులు, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్న ఎస్పీ, బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎంతమంది హాజరయ్యే అవకాశం ఉందన్న అంశాలపై అధికారులు, సిబ్బందితో చర్చించారు. "పండుగ శాంతియుత వాతావరణంలో జరగాలి. ట్రాఫిక్, భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి" అని ఎస్పీ మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సబ్ డివిజన్ డీఎస్పీ రామంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్ 5, 6 మహానాడులో కాకరవాడ

-నందికొట్కూరులో టిడిపి వర్చువల్ మహానాడు



**నందికొట్కూరు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టిడిపి జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆదేశాల ప్రకారం నందికొట్కూరు నియోజకవర్గంలోని క్లస్టర్లు 5, 6లో వర్చువల్ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి హాజరై, పార్టీ కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ లాయర్ జాకీర్, టిడిపి వార్డు, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, నాయకులు సలాం, సుకూర్ మియా, మహిళా నాయకులు, యువత నాయకులు మురళి, జాను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా హాజరై మహానాడు విజయవంతం చేశారు.

# కబడ్డీ విజేతలకు బహుమతుల పంపిణీ





**నందికొట్కూరు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూపాడుబంగ్లా మండలం పి.లింగాపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సుంకులమ్మ గుడి 3వ వర్షిహోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు ఘనంగా పంపిణీ చేశారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కేశవరెడ్డి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.20 వేల నగదు అందజేయగా, దాతగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నిలిచారు. రెండవ బహుమతిగా రూ.15 వేల నగదు డా. ధార సుధీర్, నందికొట్కూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి అందించారు. మూడవ బహుమతిగా రూ.10 వేల నగదు బొబ్బిటి రామలింగారెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు అందించగా, నాలుగవ బహుమతిగా రూ.5 వేల నగదు ఎన్. రమణారెడ్డి స్పాన్సర్ చేశారు. విజేతలకు బహుమతులను స్వయంగా కేశవరెడ్డి నాగార్జున రెడ్డి అందజేశారు. క్రీడాకారులకు భోజన సదుపాయం పెరుగు శ్రీధర్ రెడ్డి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఉపాధి కూలీ కుటుంబానికి చేయూత అవసరం

**పెరుమాళ్ళ ప్రదీప్ కుమార్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్**




**నందికొట్కూరు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పగిడ్యాలలో ఉపాధి పనిలో పాల్గొంటూ గుండెపోటుతో మృతి చెందిన ఉపాధి కూలీ పెరుమాళ్ళ ప్రదీప్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. పక్కిరి సాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో పి. సుమిత్రమ్మ, ఏవో నాగేంద్ర కుమార్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు గంధం హుస్నమ్మ మాట్లాడుతూ, "ప్రదీప్ కుమార్ ఉపాధి పనితో పాటు గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం గుండెపోటుతో మరణించడంతో ఆ కుటుంబం వీధిన పడే పరిస్థితి ఏర్పడింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదీప్ కుమార్ పిల్లలకు ఉచిత విద్య అందించాలని, భార్యకు జీవనోపాధి కోసం కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని వారు కోరారు. "లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మధు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలితాలు





**నేటి రాశి ఫలాలు**

మేషరాశి

వృత్తి ఉద్యోగాలలో ఒక సంఘటన ఆశ్చర్యం కలిగిస్తుంది. సంతానానికి విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు, సాఫీగా సాగుతాయి. హనుమాన్ చాలీసా శుభకరం

**వృషభరాశి**

ఆర్థిక ఇబ్బందులు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. నూతన ఋణయత్నాలు చేయవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అవాంతరాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఉద్యోగమున అదనపు పనిభారం ఉంటుంది. శ్రీ దుర్గా దేవి శ్లోకం శుభకరం

**మిధునరాశి**

ముఖ్యమైన వ్యవహారాలలో వ్యయప్రయాసలు తప్పవు. మిత్రులతో కలహా సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి. శ్రీ భ్రమరాంబష్టకం శుభకరం

**కర్కాటకరాశి**

ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చాలాకాలంగా పడుతున్న శ్రమ ఫలిస్తుంది. నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు కొంత సామాన్యంగా సాగుతాయి. శ్రీ ప్రత్యంగిరా దేవి శ్లోకం శుభకరం

**సింహరాశి**

బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఉద్యోగమున సహోద్యోగులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగులు శ్రమ ఫలించదు.

**కన్యరాశి**

ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక ఋణదాతల ఒత్తిడులు తొలగుతాయి. ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. భగలాముఖి శ్లోకం శుభకరం

**తులరాశి**

అనుకోని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు చేస్తారు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగములు నిరుత్సాహ పరుస్తాయి. ఇష్టదైవ శ్లోకం శుభకరం

**వృశ్చికరాశి**

కుటుంబ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. మిత్రులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. శ్రీ మహాలక్ష్మి అష్టకం పటిస్తే శుభకరం

**ధనస్సురాశి**

ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. గృహమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగ యత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సన్నిహితుల నుండి ధన సాయం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. ఇష్టకామేశ్వరి శ్లోకం పటిస్తే శుభకరం

**మకరరాశి**

కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు శిరో బాధను కలిగిస్తాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. చేపట్టిన పనుల్లో ప్రతిష్ఠంభనలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఉద్యోగాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు సహాయ సహకారాలు అందుతాయి. శ్రీ ఛాయాదేవి నామస్మరణ శుభకరం

**కుంభరాశి**

మొదలుపెట్టిన పనులు ముందుకు సాగవు. స్వల్ప అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులలో శ్రమపడ్డా ఫలితం కనిపించదు. భూ సంబంధిత క్రయవిక్రయాలలో ఒప్పందాలు వాయిదా పడతాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. శ్రీ భగలాముఖి నామస్మరణ శుభకరం

**మీనరాశి**

గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. గృహమున ఆత్మీయులతో ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. శ్రీ జంబుల పరమేశ్వరి నామస్మరణ శుభకరం

**శ్రీ కాలభైరవ ఉపవాసకులు**
**డక్క జంబులయ్య (స్వామి)**
**949163914**



# వర్షానికి తడిసిన ధాన్యం

**-- పడిపోయిన విద్యుత్ స్తంభాలు**







**ఎలిగేడు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బుధవారం రాత్రి మండలంలో వీచిన భారీ ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ర్యాకల్దేవుపల్లి గ్రామంలో కరెంట్ స్తంభం విరిగి పడటంతో దానిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయింది. ముప్పిరితోటలో కూడా విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం తడవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. "ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు పూర్తి చేయాలి. లేకపోతే రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది" అని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



రేకల్దేవ్ పల్లి లో కింద పడ్డ ట్రాన్సుఫర్మర్

# రెండు పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ సెక్షన్ల మంజూరు


**ఎలిగేడు మండలంలో విద్యా బలోపేతానికి ప్రభుత్వం చర్యలు**




ప్రీ ప్రైమరీ సెక్షన్ మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న రాములపల్లి సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్

**ఎలిగేడు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసి, 2026--27 విద్యాసంవత్సరం నుండి ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట, రాములపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ (ఎల్కేజీ--యూకేజీ) సెక్షన్లు ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేశారు.గత విద్యాసంవత్సరంలో మండలంలోని 6 పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ సెక్షన్లు మంజూరవగా, తాజాగా మరో రెండు పాఠశాలలు చేరడంతో మొత్తం సంఖ్య 8కి పెరిగింది. ఈ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. క్లాసుల పెయింటింగ్, చిన్నారుల ఆట--పాటల మెటీరియల్ కొనుగోలుకు ఒక్కో పాఠశాలకు రూ.1 లక్ష చొప్పున మంజూరు చేయనుంది. అదనంగా, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు ఒక ఇన్స్ట్రక్టర్, చిన్నారుల సంరక్షణ కోసం ఒక ఆయా నియామకం జరగనుంది.ఈ కొత్త సెక్షన్ల మంజూరుతో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. "ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ సెక్షన్లలో పిల్లలను చేర్పించి సద్వినియోగం చేసుకోవాలి" అని మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి సూచించారు.ప్రీ-ప్రైమరీ సెక్షన్ల మంజూరు పట్ల రాములపల్లి సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఆన్సర్ కీ విడుదల



**న్యూఢిల్లీ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యూపీఎస్సీ తొలిసారిగా సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026కు సంబంధించి ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్షకు హాజరై ఇది కావాలని కోరుకునే అభ్యర్థులు upsconline.nic.in లో లభించే 'ఆన్‌లైన్ క్వశ్చన్ పేపర్ రిప్రజెంటేషన్ పోర్టల్ (క్యూపీరెప్)కు మే 31 సాయంత్రం ఆరు గంటల లోగా విజ్ఞాపనలను సమర్పించవచ్చునని అధికారులు తెలిపారు.ఇంతక్రితం సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలకు సంబంధించిన తుది కీలను తుది ఫలితాలు, ఇంటర్వ్యూలు సహా కొన్ని నెలలు ఆలస్యంతో విడుదల చేసేది.

# ఆమనగల్లు హ్యాపీ హోమ్స్ వెంచర్ వద్ద కత్తుల దాడి కలకలం

**- ఇద్దరిపై విచక్షణారహిత దాడి చేసిన ముగ్గురు అరెస్ట్**

**- సాంకేతిక ఆధారాలతో వేగంగా ఛేదించిన ఆమనగల్లు పోలీసులు**




**ఆమనగల్లు, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలో అర్ధరాత్రి చోటుచేసుకున్న కత్తుల దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. బస్‌స్టాండ్ పార్కింగ్ స్థలం వద్ద ప్రారంభమైన చిన్న వివాదం, హ్యాపీ హోమ్స్ వెంచర్ వద్ద రక్తపాతానికి దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా, పోలీసులు వేగంగా స్పందించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, మే 25/26 తేదీల మధ్య రాత్రి సమయంలో అమంగల్ ఆర్టీసీ బస్‌స్టాండ్ పార్కింగ్ ప్రాంగణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బిట్టి సిద్దు ఏ బిట్టు, దూదేకుల సయ్యద్, రుద్రసి నరసింహలను పార్కింగ్ స్థలం నిర్వాహకుడు మహబూబ్ అలీ ప్రశ్నించాడు. మాటామాటా ఘర్షణకు దారితీసి, అనంతరం హ్యాపీ హోమ్స్ వెంచర్ వద్దకు రావాలని నిందితులు సవాల్ విసిరారు.దీంతో మహబూబ్ అలీ తన స్నేహితుడు సమీర్తో కలిసి అక్కడికి వెళ్లగా, ముందే కత్తులతో సిద్ధంగా ఉన్న నిందితులు విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దాడికి ఉపయోగించిన కత్తితో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ (టీఎస్ 07 హెచ్.జెడ్ 2746), పల్సర్ మోటార్ సైకిల్ (టీఎస్ 07 హెచ్.జెడ్ 0236)లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ చేసిన నిందితులు బీసీ కాలనీకి చెందిన బిట్టి సిద్దు ఏ బిట్టు, వెంకటేశ్వర కాలనీకి చెందిన దూదేకుల సయ్యద్, శ్రీనివాస కాలనీకి చెందిన రుద్రసి నరసింహగా పోలీసులు వెల్లడించారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి రిమాండ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# అహ్మదాబాద్‌లో ఎబోలా కలకలం.

**- కాంగో జాతీయుడు సహా ముగ్గురి ఐసోలేషన్**




**న్యూఢిల్లీ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఎబోలా కలకలం రేపింది. ఎబోలా అనుమానితులైన కాంగో జాతీయుడు సహా మరో ముగ్గురిని ఐసోలేషన్‌లో ఉంచారు. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్షేరియా బుధవారం వెల్లడించారు. వీరి నుంచి శాంపిల్స్ సేకరించి, ఎబోలా పరీక్షా కేంద్రానికి పంపించినట్లు ఆయన తెలిపారు. మరోవైపు అంతకుముందు కర్ణాటక రాజధాని బెంగళూరులో కూడా ఉగాండా నుంచి వచ్చిన ఒక మహిళలో ఎబోలా లక్షణాలు ఉండటంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు.ఆమెను బెంగళూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అధికారులు అక్కడ ఐసోలేషన్‌లో ఉంచారు. అనంతరం ఆమె నుంచి శాంపిల్స్ సేకరించి ఎబోలా పరీక్షల కోసం పంపారు. ఈ ఫలితాల్లో ఆమెకు నెగెటివ్ వచ్చినట్లు కర్ణాటక ఆరోగ్య శాక మంత్రి దినేష్ గుండు రావ్ తెలిపారు. అందువల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. ప్రజల ఆరోగ్యం, అప్రమత్తత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తగిన మెడికల్ ప్రోటోకాల్, ముందు జాగ్రత్త చర్యలు అనుసరించాలని ఆయన కోరారు. బెంగళూరుకు వచ్చిన మహిళ ఉగాండా నుంచి ఈ నెల 23న కెంపెగౌడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అనంతరం ఆమెను వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఎబోలా లక్షణాలు కనిపించడంతో అధికారులు ఆమెను ఐసోలేషన్‌లో ఉంచి పరీక్షలు నిర్వహించారు.ప్రస్తుతం ఎబోలా గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. దేశంలో ఎబోలా వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. మరోవైపు ఆఫ్రికాలో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. అందులోనూ కాంగోలో ఎక్కువగా వ్యాపిస్తుండటంతో పొరుగు దేశమైన ఉగాండా తన సరిహద్దును మూసేసింది.

# అత్తమామలు సర్దుకుపొమ్మని చెప్పడం క్రూరత్వం కాదు



**న్యూఢిల్లీ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భార్యాభర్తల మధ్య జరిగే గొడవల్లో అత్తమామలు మౌనంగా ఉన్నంత మాత్రాన వారిపై వరకట్న వేధింపుల కేసులు పెట్టలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. నైతికంగా ఆ ప్రవర్తన తప్పుకావచ్చు కానీ, దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. భర్త కుటుంబ సభ్యులందరినీ గుడ్డిగా కేసుల్లోకి లాగడం సరికాదని వ్యాఖ్యానించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భర్తకు మద్దతు ఇచ్చారనో, గొడవల్లో జోక్యం చేసుకోలేదనో లేదా సర్దుకుపోవాలని సలహా ఇచ్చారనో అత్తమామలపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించలేమని కోర్టు తెలిపింది. సర్దుకుపొమ్మని సలహా ఇవ్వడం క్రూరత్వం కాదని స్పష్టంచేసింది.నేరంలో వారి ప్రత్యక్ష భాగస్వామ్యం లేదా నిర్దిష్టమైన పాత్ర ఉంటే తప్ప కేవలం సాధారణ ఆరోపణలతో అత్తమామలను దోషులుగా నిలబెట్టలేమని ధర్మాసనం వివరించింది. మధ్యప్రదేశ్‌లోని గుణ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తమామలపై పెట్టిన వరకట్న వేధింపుల కేసును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కొట్టివేసింది. సదరు మహిళ తన అత్తమామలపై ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలు చేయలేదని కోర్టు గుర్తించింది. విఫలమైన వివాహ బంధంలో మహిళ పడే వేదనను తక్కువ చేసి చూడలేమని చెబుతూనే ఇలాంటి వైవాహిక వివాదాల కేసులను విచారించేటప్పుడు కింది కోర్టులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది. వైవాహిక వివాదాల్లో తీవ్రమైన భావోద్వేగాలు, వ్యక్తిగత కక్షలు దాగి ఉంటాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సమయాల్లో కేవలం భర్తపైనే కాకుండా, గొడవలతో ఎలాంటి సంబంధంలేని అతని కుటుంబ సభ్యులందరినీ కేసుల్లో ఇరికించే ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితులుగా చేర్చిన వారు నిజంగానే క్రూరత్వానికి పాల్పడ్డారా..? అదనపు కట్నం కోసం వేధించారా..? అనేదానికి పక్కా ఆధారాలు ఉండటం చట్టప్రకారం ముఖ్యమని కోర్టు స్పష్టంచేసింది.

# పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయ్..

**ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా భారత్ వార్నింగ్**



**న్యూఢిల్లీ, మే 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా పాకిస్థాన్ పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత వంటి సూత్రాలను పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై జరిగే ఉగ్రదాడుల నుంచి తమను తాము రక్షించుకునే పూర్తి హక్కు తమకు ఉందని, పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని గట్టిగా హెచ్చరించింది. చైనా అధ్యక్షతన జరిగిన యూఎన్ఎస్సీ బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేసిన ఆధారరహిత ఆరోపణలను తిప్పికొట్టారు.స్వతంత్ర భారతదేశం ఏర్పడిన నాటి నుంచి నిత్యం సరిహద్దు ఆక్రమణలకు వ్యతిరేకంగా పోరాడుతోందని హరీశ్ పర్వతనేని అన్నారు. చట్టబద్ధంగా, తిరిగి మార్చలేని విధంగా భారత్‌లో విలీనమైన భూభాగాలను ఆక్రమించుకోవడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉందని ఆయన చారిత్రక వాస్తవాలను గుర్తుచేశారు. భారత్‌ను వెయ్యి గాయాలతో రక్తమోడించాలనే పాకిస్థాన్ సిద్ధాంతం, వారి డొల్ల మాటలను బట్టబయలు చేస్తోందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదం నుంచి తనను రక్షించుకునే పూర్తి హక్కు భారత్‌కు ఉందని స్పష్టంచేశారు. తన చర్యలకు పాకిస్థాన్ తగిన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. ఉగ్రవాదం, మత ఛాందసవాదం, హింసాత్మక రాడికలిజం వంటి దుష్టశక్తులను పాకిస్థాన్ నిరంతరం ప్రోత్సహిస్తోందని, ఇకనైనా ఉగ్రవాదానికి అన్ని విధాలుగా మద్దతును శాశ్వతంగా నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు ఇదే చర్చలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తావించారు. దీనికి భారత్ బలంగా బదులిచ్చింది. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిందనే సంగతి గుర్తుంచుకోవాలని చెప్పింది.